




ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
20-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 251

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# ఇక టార్గెట్ బండి సంజయ్

- పక్కా వ్యూహంతో బీఆర్ఎస్ కార్యాచరణ
- భగీరథ్ అరెస్టులో గులాబీ పార్టీ కీలక పాత్ర
- నిరసనలు, ఆందోళనలతో ప్రభుత్వంపై ఒత్తిడి
- సీఎం రేవంత్ రెడ్డి స్పందించేలా కార్యక్రమాలు
- ఇక బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** ప్రతిపక్ష బీఆర్ఎస్ తమ తదుపరి టార్గెట్ ను ఫిక్స్ చేసుకుంది. నిన్నటిదాకా పోక్సో కేసు నమోదైన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై, పోలీసులపై ఒత్తిడి పెంచిన బీఆర్ఎస్..ఇప్పుడు బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తోంది.




# ఏసీబీ వలకు జలమండలి అవినీతి తిమింగలం..

- రూ.1.10 కోట్ల నగదు, కేజీ బంగారం స్వాధీనం
- హైదరాబాద్ వాటర్ బోర్డ్ జీఎం ఎస్.ఎల్. కుమార్ ఇళ్లపై ఏసీబీ దాడులు
- సోదాల్లో రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారం, ఆస్తి పత్రాల స్వాధీనం
- హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో 8 చోట్ల ఏకకాలంలో సోదాలు
- మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.100 కోట్లు ఉండొచ్చని అధికారుల అంచనా

హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.

**హైదరాబాద్, ప్రభాత సూర్య** :మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు.

## ఢిల్లీలో కీలక సమావేశాలతో బిజీగా ఉన్న నాదెండ్ల మనోహర్

- రెండో రోజు చురుగ్గా సాగుతున్న నాదెండ్ల మనోహర్ ఢిల్లీ టూర్
- కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ తో భేటీ
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో కూడా సమావేశం

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

- కెసిఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ప్రభాత సూర్య :** పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు.



2లో

ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం

# కొత్త హెల్త్ స్కీమ్

- మెరుగైన వైద్య సేవల కోసం కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్" ఏర్పాటు
- అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ
- కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను సమర్పించాలి

2లో



2లో

# బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు

- బండి సంజయ్‌ని పదవి నుంచి దించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని విమర్శ
- అది మంచి పద్ధతి కాదన్న మల్లు రవి
- కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని నిలదీత

2లో

# ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం: సత్యకుమార్

- నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేశామన్న సత్యకుమార్
- 785 ప్రైవేట్ ఆసుపత్రులకు నిధులు అందాయని విడుదల
- ఇప్పటి వరకు మొత్తం రూ. 5,556 కోట్లు విడుదల చేశామని వెల్లడి

## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

- ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపు
- 34 నుంచి 44 ఏళ్లకు పెంపు
- నిరుద్యోగుల వినతుల మేరకు ఉత్తర్వులు
- ఏడాది పాటు వచ్చే అన్ని నోటిఫికేషన్లకు వర్తింపు
- నియామకాల ఆలస్యం వల్ల నష్టపోయిన అభ్యర్థులకు లబ్ధి
- యూనిఫాం సర్వీసుల ఉద్యోగాలకు పెంపు

# బండి బగీరథ్ కేసు.. మరో సిట్ ఏర్పాటు

- బండి బగీరథ్ బెయిల్ కేసును విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి దేవి
- ఆమెను లక్ష్యం చేసుకుని సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు
- తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం.. సిట్ ఏర్పాటు



తెలంగాణలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు, బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో మరో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ జరుపుతున్న హైకోర్టు న్యాయమూర్తిపై సోషల్ మీడియా వేదికగా జరిగిన అనుచిత, అవమానకర ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. దీనిపై సమగ్ర దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. జాయింట్ సీపీ శ్వేత ఆధ్వర్యంలో ఈ సిట్ పనిచేస్తుందని, న్యాయవ్యవస్థపై జరిగిన ఈ దుష్ప్రచార మూలాలను పూర్తిగా వెలికితీస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. బండి భగీరథ్‌కు సంబంధించిన

# 'పాలమూరు'కు యుద్ధప్రాతిపదికన భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష



హైదరాబాద్: పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టుల భూసేకరణనూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.

# ఇక టార్గెట్ బండి సంజయ్

కొడుకు తప్పును కప్పిపుచ్చి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ బేషరతుగా పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కరీంనగర్, వేములవాడ, సిరిసిల్లలో కారు పార్టీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేసిన మరుసటి రోజే బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్ రోడెక్కారు. సిరిసిల్లలో బీజేపీ, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా చేపట్టిన ధర్నా పరస్పర దాడులు, ఘర్షణలతో రణరంగంగా మారింది. బండి సంజయ్ డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు, కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేయడంతో..రెండు వర్గాల మధ్య మాటామాటా పెరిగి, తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఆ తర్వాత దాడులకు దిగారు. నిజానికి బండి భగీరథ్ వ్యవహారం వెలుగులోకి వచ్చినప్పటి నుంచే బీఆర్ఎస్ దూకుడుగా ముందుకెళ్లింది. ఈ అంశాన్ని కేవలం విమర్శలకే పరిమితం చేయకుండా..రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి దూకుడుగా ముందుకెళ్లింది. ఏకంగా పేట్ బషీరాబాద్ పీఎస్ ముట్టడి, డీజీపీకి వినతిపత్రాలు, ప్రెస్‌మీట్లు, ప్రజా ఉద్యమాలతో సర్కార్‌పై ఒత్తిడి పెంచడంలో కీలక పాత్ర పోషంచింది. చివరకు బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారా.? లేక ఆయనే లొంగిపోయారా.? రేవంత్ ప్రభుత్వం చెప్తున్నట్లు సంజయ్ కొడుకును అరెస్ట్ చేశారా.? బండి సంజయ్ ప్రకటించినట్లు భగరీథ్‌ను పోలీసులకు అప్పగించారా.? ఈ అంశాలపై కూడా విస్తృతంగా చర్చ జరిగేలా చేసి బీఆర్ఎస్ రాజకీయంగా పైచేయి సాధించిందన్న చర్చ సాగుతోంది. అధికార కాంగ్రెస్, బీజేపీలను కార్నర్ చేస్తూ తామే బలమైన ప్రతిపక్షమనే సంకేతాన్ని ఇచ్చిందన్న టాక్ వినిపిస్తోంది.

**ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో సక్సెస్..**

బండి భగీరథ్ కేసు తెరమీదకు వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుస ట్వీట్లు చేస్తూ..ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వచ్చారు. ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అయితే.. డైరెక్ట్ మీడియా ముందుకు వచ్చేసి సంచలన విషయాలు బయపెడుతూ..భగరీథ్ జైలుకు వెళ్లే వరకు సర్కారుపై ఒత్తిడి పెంచగలిగారు. కేటీఆర్ అయితే ఆర్ఎస్పీని వేదికపైనే మీదే అప్రిషియేట్ చేశారు. బండి భగీరథ్ ఇష్యూలో పోరాడి..ఓ అమ్మాయికి న్యాయం దక్కడంలో కీలక పాత్ర పోషించారని ఆర్ఎస్ ప్రవీణ్‌ను పార్టీ కార్యక్రమంలో మెచ్చుకున్నారు కేటీఆర్. దీంతో తమ నిరంతర పోరాటం ఫలితంగానే బండి భగీరథ్ అరెస్ట్ జరిగిందని బీఆర్ఎస్ ఓపెన్‌గానే చెప్పుకొన్నట్లు అయింది.అంతేకాదు.. ఈ కేసులో అధికార కాంగ్రెస్, బీజేపీల తీరుపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమయ్యేలా చేయడంలో తాము కొంతలో కొంతైనా సక్సెస్ అయ్యామని గులాబీ లీడర్లు చెబుతున్నారు. కేవలం ఒక సంఘటనగా కాకుండా, ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది కారు పార్టీ. ఓవైపు ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తూనే..మరోవైపు కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనంటూ హైలెట్ చేసేలా యాక్టివిటీ చేపట్టింది. ఓ వైపు అధికార పార్టీ నేతలు ఔట్‌రైట్ స్టేట్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితుల్లో ఉండగా..అటు బీజేపీలో అంతర్గత చర్చ ఏ నేత మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు సాహసం చేయలేదు. దీనంతటికి తాము చేసిన పోరాటమే కారణమని బీఆర్ఎస్ చెప్పుకుంటుంది.

**వ్యూహాలకు బీఆర్ఎస్ పదును..**

మొన్నటి వరకు భగీరథ్‌ను కేసు నుంచి తప్పించే కుట్ర జరుగుతోందని ఫైర్ అయిన బీఆర్ఎస్..ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. శనివారం రాత్రి భగీరథ్ జైలుకు వెళ్లాడు. దీంతో ఇప్పుడు రాజకీయ వ్యూహాలకు పదును పెడుతోంది గులాబీ పార్టీ. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్న డిమాండ్‌ను బలంగా వినిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేయడం..ఆ తర్వాత గులాబీ శ్రేణులు రోడ్డెక్కడం చర్చకు దారితీస్తోంది. సంజయ్‌ను బర్తరఫ్ చేయాలంటూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి బీజేపీని కార్నర్ చేసేలా వ్యూహాలు రచిస్తోంది ప్రధాన ప్రతిపక్షం. అటు అధికార కాంగ్రెస్‌కు, ఇటు అధికారంలోకి రావాలని కలలు కంటున్న బీజేపీకి తామే ప్రత్యామ్నాయం అంటూ స్ట్రాంగ్ ఇండికేషన్స్ పంపిస్తోంది బీఆర్ఎస్ పార్టీ.

# బండి బగీరథ్ కేసు.. మరో సిట్ ఏర్పాటు



ముందస్తు బెయిల్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవి వద్దకు విచారణకు వచ్చింది. ఈ క్రమంలో కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్ వేదికగా ఆమెను లక్ష్యంగా చేసుకుని కొన్ని అనుచిత పోస్టులను సర్క్యులేట్ చేశారు. బండి భగీరథ్‌కు గనుక ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే, దానికి ప్రతిఫలంగా జస్టిస్ మాధవి దేవి భర్తకు బార్ కౌన్సిల్ చైర్మన్ పోస్ట్ ఇస్తారంటూ తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టులను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ వ్యవహారం న్యాయవ్యవస్థ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసు విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి తనపై జరుగుతున్న ఈ దుష్ప్రచారంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం విచారణ జరిపే న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఇలాంటి పోస్టులు పెట్టడంపై దిగ్భ్రాంతి వ్యక్తమైంది. దీనిపై తెలంగాణ న్యాయమూర్తుల సంఘం నేతలు కూడా తీవ్రంగా స్పందించారు. ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా పోస్టులు పెట్టిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సోషల్ మీడియా దాడికి సంబంధించి ఇప్పటికే ప్రధాన నిందితుడైన దామోదర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసులు నమోదు చేశారు. జాయింట్ సీపీ శ్వేత నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ఈ పోస్టుల వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు, ఏ ఐటీ సెల్స్ దీనిని వ్యాప్తి చేశాయనే కోణంలో లోతైన దర్యాప్తు ప్రారంభించింది.




## ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం: సత్యకుమార్

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల బలోపేతం దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం ప్రభుత్వం రూ. 919.13 కోట్లను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో భాగంగా ఈ నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన వివరించారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 785 ప్రైవేట్ ఆసుపత్రులకు ఈ నిధులు అందాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులకు మొత్తం రూ. 5,556 కోట్లను చెల్లించామని, బకాయిల చెల్లింపుల హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. దీనికి సంబంధించిన నివేదికను ట్రస్టు సీఈఓ చక్రధరబాబు మంత్రికి అందజేశారు.

# ఏసీబీ వలకు జలమండ అవినీతి తిమింగలం..

(మొదటి పేజీ తరువాయి)

ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ప్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.హైదరాబాద్‌లోని మెట్రో వాటర్ సప్లై అండ్ మురుగునీటి పారుదల బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీ)లో భారీ అవినీతి బట్టబయలైంది. ఆదాయానికి



మించి ఆస్తులు కూడబెట్టారన్న పక్కా ఆరోపణలతో వాటర్ బోర్డ్ రెడ్ హిల్స్ విభాగం జనరల్ మేనేజర్ (జీఎం) ఎస్.ఎల్. కుమార్‌కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదు, బంగారం, ఆస్తి పత్రాలు లభించడంతో అధికారులు సైతం విస్తుపోయారు. ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ సోదాలు జరిగాయి. ఈ రోజు ఉదయం ప్రారంభమైన ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్లకు పైగా నగదు, కేజీ బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పలు కీలకమైన ఆస్తి పత్రాలను కూడా సీజ్ చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో నగదును లెక్కించి, బంగారు ఆభరణాలను సీల్ చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం కుమార్ ఆస్తుల విలువ మార్కెట్‌లో సుమారు రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీలలో మూడు ఫ్లాట్లు, ఆరు ఓపెన్ ప్లాట్లు, నిజామాబాద్ జిల్లాలో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. దీంతో పాటు కొన్ని కార్లు కూడా ఆయన పేరు మీద ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం ఎస్.ఎల్. కుమార్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఈ ఆస్తుల వెనుక ఉన్న ఆదాయ వనరులపై లోతుగా ప్రశ్నిస్తున్నారు. ఆయనకు సంబంధించిన బ్యాంకు లాకర్లను కూడా తెరిచి తనిఖీ చేయనున్నారు.గతేడాది డిసెంబర్‌లోనూ రవాణా శాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ కేసులో ఏసీబీ సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వాటర్ బోర్డ్ అధికారి కేసులోనూ అదే స్థాయిలో ఆస్తులు బయటపడటం తెలంగాణలో కలకలం రేపుతోంది. ఈ సోదాలపై పూర్తి వివరాలను ఏసీబీ అధికారులు సాయంత్రం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ ప్రభుత్వం కొత్త హెల్త్ స్కీమ్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా "ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్"ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా కనిపిస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించింది. ఆర్థిక శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి.ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఐఎఫ్ఎంఐఎస్-హెచ్ఆర్ పోర్టల్లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సమాచారం నమోదు చేయాలని లేదంటే భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## బండి సంజయ్ రాజీనామా చేయాలనడం సరికాదు

బండి సంజయ్‌ని కేంద్రమంత్రి పదవి నుంచి దించాలని, రాజీనామా చేయించాలని సొంత పార్టీ ఎంపీలే ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మల్లు రవి అన్నారు. కానీ అది మంచి పద్ధతి కాదని అన్నారు. ఆయనను పదవిలో నుంచి దించేస్తే తాము వస్తామని కొందరు భావిస్తున్నారని ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కుమారుడు బండి భగీరథ్ తప్పు చేస్తే బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలనడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా చట్టానికి లొంగిపోయేలా చేసి బాధ్యతాయుతంగా వ్యవహరించారని కితాబిచ్చారు. మద్యం పాలసీ కేసులో కవిత జైలుకు వెళ్ళినప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇలాంటి అంశాల్లో పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని సూచించారు. పిల్లలు అన్నాక తప్పు చేస్తారని, కానీ దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. బండి సంజయ్ తన కుమారుడిని దాచిపెట్టకుండా సరెండర్ చేశారని గుర్తు చేశారు.

## ఢిల్లీలో కీలక సమావేశాలతో బిజీగా ఉన్న నాదెండ్ల మనోహర్

ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఢిల్లీ పర్యటన రెండో రోజు అత్యంత చురుగ్గా సాగింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ధ్యేయంగా కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్, సంయుక్త కార్యదర్శి సుజాత శర్మలతో మంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలతో పాటు కేంద్ర, రాష్ట్రాల మధ్య సరఫరా వ్యవస్థ సమన్వయంపై లోతుగా చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో మర్యాదపూర్వకంగా భేటీ అయి, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు, సరుకులు అందించేందుకు కేంద్ర సహకారాన్ని కోరారు. తమ ప్రభుత్వానికి ప్రజల ప్రయోజనాలే అత్యంత ప్రాధాన్యమని, పౌరసరఫరాల వ్యవస్థను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు వేగవంతం చేస్తున్నామని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ చర్చలపై కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

తెలంగాణలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి గరిష్ఠ వయోపరిమితిని మరో పదేళ్ల పాటు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్లుగా ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇది ఇప్పుడు 44 ఏళ్లకు పెరిగింది. ఈ అదనపు వయో సడలింపు నిబంధన ఏడాది పాటు రానున్న అన్ని నోటిఫికేషన్లకు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగాల భర్తీలో జరిగిన ఆలస్యం, కరోనా మహమ్మారి, నోటిఫికేషన్లు రాకపోవడం వంటి కారణాల వల్ల ఎంతోమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి నష్టపోయారు.

# ప్రత్యేక ఓటర్ల సవరణ



**మే 19 ఇబ్రహీంపట్నం ప్రతినిధి ప్రభాత సూర్య :** ఆదిభట్ల సర్కిల్-15లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిప్యూటీ కమిషనర్ సమావేశం ఆదిభట్ల: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియలో భాగంగా ఆదిభట్ల సర్కిల్-15 కార్యాలయంలో తేది.19.05.2026 మంగళవారం రోజున ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీ బి. సత్యనారాయణ రెడ్డి గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ... ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నమ్మకమైనదిగా రూపొందించడమే లక్ష్యంగా ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ల సవరణ, మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జాబితాలో ఉన్న డబుల్ ఓటర్లు (రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారు), మరణించిన ఓటర్లు (డెత్ ఓటర్లు), మరియు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన (పెర్మనెంట్లీ షిఫటెడ్) ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్టప్రకారం తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఓటర్ల మ్యాపింగ్ మరియు సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు (బ్లేస్) పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసేందుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి గారు,ఏ ఎం సి. శ్రీనివాస్ గారు సర్కిల్ అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పార్టీ రాజకీయ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మే 21 నుండి 26 వరకు విప్లవ శిఖరం కామ్రేడ్ జెన్ను స్మారక సభలను జయప్రదం చేయండి: సిపిఐ (ఎం ఎల్ ) న్యూడెమోక్రసీ

**ప్రభాత సూర్య నార్కట్ పల్లి (మే 19)ప్రతినిధి :** సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ జలగం జనార్ధన్ (జెన్ను సార్) ఐదవ వర్ధంతి సందర్భంగా మే 21నుండి 26 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని, 26న నకిరేకల్ పట్టణంలో నక్సలిజం బి దాని ప్రాధాన్యత అనే అంశంపై స్మారక ఉపన్యాసభ ఉంటుందనీ పీ ఓ డబ్ల్యూ జిల్లా కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర, ఏ ఐ కె ఎం యస్ జిల్లా ఉపాధ్యక్షులు గజ్జి రవి లు పిలుపునిచ్చారు.నార్కట్ పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో సభ కరపత్రాలు ఉపాధి కూలీలతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ జెన్ను భాయ్ విద్యార్థి దశ నుండి విప్లవ రాజకీయాలను, హేతువాదాన్ని అలవర్చుకొని విప్లవ కమ్యూనిస్టు పార్టీ లో చేరి అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించి పోలీస్ అక్రమ కేసులను, జైలు నిర్బంధాలను ఎదుర్కొని తన చివరి శ్వాస వదిలే వరకు ఈ వ్యవస్థ మారాలని పోరాడిన గొప్ప నాయకుడని, ఆయన అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన అందించిన పోరాట స్ఫూర్తితో నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై పోరాడాల్సిన కర్తవ్యాలను రూపొందించుకొని ఉద్యమించాలన్నారు. నేడు మోడీ ప్రభుత్వం నక్సలైట్లను నిర్మూలించాలని తహతహలాడుతున్నారని ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర వ్యతిరేకమైనదని, భిన్న రాజకీయాలు కలిగినటువంటి విప్లవకారులను అంతమొందించాలని చట్ట విరుద్ధంగా వ్యవహరించటం



మూర్ఖత్వమని అన్నారు. ఈ వ్యవస్థలో అసమానతలు ఉన్నంతకాలం నక్సలిజం సమస్య ఈ ప్రభుత్వాలకు కొరకరాని కొయ్యగా మారుతుందని, పాలకుల పునాదులు కదులుతాయని వాళ్ళని నిర్మూలించాలని అనుకోవడం అవివేకం అన్నారు. నేడున్న ఈ వ్యవస్థ యొక్క స్వరూప, స్వభావాలను అర్థం చేసుకున్నప్పుడు ఈ దేశానికి నక్సలిజం అవసరం ఉన్నదా లేదా అనేది చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో నక్సలైట్లు నిర్మూలించబడ్డారని పాలకులు చెబుతున్నప్పుడు జెన్ను సార్ ఐదో వర్ధంతి సందర్భంగా నక్సలిజం బి దాని ప్రాధాన్యత అనే అంశంపై సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో సిపిఐ (ఎం.ఎల్ )న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డేవిడ్ కుమార్ ముఖ్య అతిథిలు గా హాజరై మాట్లాడతారని కావున వివిధ వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు ప్రజాసామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ యం యల్ న్యూడెమోక్రసీ నాయకులు బూరుగు సత్యనారాయణ, దండేంపల్లి చంద్రయ్య, జయలక్ష్మి, పద్మ, సుశీల, బాలమణి, చంద్రయ్య, గాలి సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ మ్యాపింగ్ పనులు 90 శాతం నెలాఖరులోగా పూర్తి చేయాలి

**మిర్యాలగూడ మే 19:- (ప్రభాత సూర్య):** ఓటర్ జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్)మ్యాపింగ్ పనులు 90 శాతం నెలాఖరులోగా పూర్తి చేయాలని మిర్యాలగూడ తహసీల్దార్ పి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ పి. శ్రీనివాస్ కోరారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో జరిగిన సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో మ్యాపింగ్ 55.85 శాతం, మండలంలో 78.5 శాతం రెండు కలిపి 70.25 శాతం జరిగిందని అన్నారు. మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలో 70.23 శాతం మ్యాపింగ్ జరిగిందన్నారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం మ్యాపింగ్ నిర్వహించి నెలాఖరు లోగా పూర్తి చేయాలని కోరారు. తమ పనులు పక్కకు పెట్టి పూర్తి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఎండి.అబ్బాస్, కల్పన, జూనియర్ అసిస్టెంట్ శ్రావణిలు పాల్గొన్నారు.






## గ్రామీణ , పట్టణ ప్రాంత వివిధ వర్గాల వారికి జూన్ 2 వరకు ఉచిత పెరుగన్నం




**మిర్యాలగూడ మే 19:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ ప్రతీ రోజు 3వేల మందికి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పెరుగన్నం పంపిణీ 36వ రోజు మంగళవారం కార్యక్రమంలో పెరుగన్నం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు వేసవికాలం ఉపశమనం కోసం బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నాడు ప్రారంభమైన ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం పూర్తవుతుందని తెలిపారు.

జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వరకు కొనసాగుతుందన్నారు.ప్రతిరోజు దాదాపు 3వేల మందికి పైన ఈ పెరుగన్నం పంపిణీ చేస్తునట్టు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు డి.స్కైలాబ్ నాయక్, దేశిడి శేఖర్ రెడ్డి, దాస్య, శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..



## నేటి యువతకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శం

41వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి.

సిపిఎం పార్టీ నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు



**ప్రభాత సూర్య నర్సాపూర్ మే19:** భారత కమ్యూనిస్టు ఉద్యమ మహానేత, ప్రజా నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా నర్సాపూర్ పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం పేదలు, కార్మికులు, రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సామాజిక సమానత్వం, శ్రమజీవుల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు నేటి తరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నేటి పరిస్థితుల్లో ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సుందరయ్య జీవితాంతం పేద ప్రజల హక్కుల కోసం, సమసమాజ నిర్మాణం కోసం, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.కార్మికులు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. యువత సుందరయ్య త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాఘభూషణం, కుమార్, చందర్, రాములు, ఎల్లయ్య, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన: ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ మే 19:-( ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం జటావత్ తండాలో ధర్మ రక్షకుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఒక వ్యక్తి కాదు ఆయనో అజేయమైన శక్తి, ఒక చరిత్ర, ధైర్యానికి ప్రతీకని ఆయన జీవితం మనకు ఎన్నో గొప్ప పాఠాలనునేర్పుతుందన్నారు.

పరాయి పాలనను ఎదిరించి, హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు శివాజీ శత్రువుల స్త్రీలను సైతం తల్లీ సమానంగా గౌరవించిన గొప్ప సంస్కృతి శివాజీ మహారాజ్ దన్నారు.ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయని దృఢ సంకల్పం, ప్రజల సంక్షేమాన్ని కోరుకునే పరిపాలనా దక్షత ఆయన సొంతమన్నారు.శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళన్నారు. కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించిన యువత, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక అభినందనలన్నారు. శివాజీ మహారాజ్ చూపిన ధైర్య సాహసాలు, దేశభక్తి మనందరికీ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయిస్తే కఠిన శిక్షలు ఉన్నాయి

**మిర్యాలగూడ మే 19:- (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మండలం గోపసముద్రం తండాకు చెందిన మహిళ నాటు సారా తయారు చేయకుండా, విక్రాయించకుండా ఉండేలా మిర్యాలగూడ తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ ముందు మంగళవారం బైండ్ ఓవర్ చేయాంచారు. ఎక్సయిజ్ కాన్స్టేబుల్ ఆమెను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టగా భవిష్యత్తులో మళ్లీ నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన శిక్షలున్నాయని జైలుకు పంపాల్సి ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు.



# సుందరయ్య ఆశయాలను కొనసాగిస్తాం






## దోపిడీ వ్యవస్థ పై సమర శంఖం పూరిస్తాం

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్

తుర్కయంజాల్,ప్రభాత సూర్య: స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు వైతాళికులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పార్లమెంట్ కే వన్నెతెచ్చిన నికార్సైన ప్రజా నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి 41వ వర్ధంతి జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కమ్మగూడ సుందరయ్య నగర్ కాలనీ మరియు రాగన్నగూడ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ నాయకులు పోదేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మచ్చలేని మహా నాయకుడని, ఆయన జీవితమంతా పేదప్రజల కోసం అంకితం చేశారని, అటు చట్టసభల్లో ఇటు ప్రజాక్షేత్రంలో నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడిన నికార్సైన ప్రజా నాయకుడు సుందరయ్య అని కొనియాడారు. దేశ పార్లమెంట్లో మొట్టమొదటి ప్రతిపక్ష నాయకుడిగా దేశంలోని అనేక ప్రజా సమస్యల మీద సుందరయ్య పనిచేశారని గుర్తు చేశారు. తాను ప్రసంగిస్తుంటే అధికార పక్షం సైతం కరచాల ధ్వనులతో స్వాగతం పలికేవారని అన్నారు. ఉన్నత భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ తన జీవితమంతా అత్యంత నిరాడంబరంగా దోపిడీ లేని అసమానతలు లేని సమాజం రావాలని సుందరయ్య కృషి చేశారని అన్నారు. కానీ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజల్ని మోసం చేస్తూ అధికార దాహంతో ప్రజాధనాన్ని పెట్టుబడుదారులకు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ దేశ ప్రజల్ని కుల మత విద్వేషాలతో రెచ్చగొడుతున్నారని అన్నారు. భవిష్యత్ తరాలు సుందరయ్య గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు కే అరుణ్ కుమార్,ఎం సత్యనారాయణ,పి శ్రీనివాసులు, ఐ భాస్కర్,కే శారద,పార్టీ సీనియర్ నాయకులు ఏ భాస్కర్ రెడ్డి,బడుగు శంకరయ్య,కృష్ణ, యం.యాదయ్య,మాధవరెడ్డి, గనిపల్లి రాములు,కే సత్యనారాయణ,ప్రవీణ్ పాల్గొన్నారు.

# బంగారు మైసమ్మ తల్లి దేవస్థానం నిర్మాణం నాణ్యతతో పూర్తి చేయాలి





మిర్యాలగూడ మే 19:-( ప్రభాత సూర్య): దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన కల్లేపల్లి బంగారు మైసమ్మ తల్లి దేవస్థానం నిర్మాణ పనులను మంగళవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్ తో కలిసి గుడి నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో కల్లేపల్లి బిఆర్ఎస్ పార్టీ ఉప సర్పంచ్ దీరావత్ హుస్సేన్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలు చూసి అలాగే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకోసం పనిచేస్తున్న స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ నాయత్వంలో పనిచేసేందుకు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతునట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డ. స్కైల్యాబ్ నాయక్, డి.రవితేజ, వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మహిళలును అన్ని రంగాలలో ముందుకు రాణించాలి

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి



ప్రభాత సూర్య మాడుగులపల్లి (మే 19) ప్రతినిధి: మహిళలు ఆత్మస్థైర్యంతో తగిన సమయంలో నేర్చుకుంటే అన్ని రంగాల్లో ముందుకు రాణిస్తారు ఎం వి ఎన్ విజ్ఞాన కేంద్రం సేవలు అభినందనీయం గోలి అమరేందర్ రెడ్డిమహిళలు ఆత్మస్థైర్యంతో తగిన సమయంలో ప్రతిది నేర్చుకుంటే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు ఎంవియన్ విజ్ఞాన కేంద్రం మాడుగులపల్లి, ఇందుగులలో కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోలి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం టైలరింగ్ తో పాటు నల్లగొండలో అనేక విభాగాలలో పని చేయడాన్ని అభినందించారు. ఇక్కడ మీరు కుట్టు శిక్షణ నేర్చుకున్న తీరు చాలా ఆకర్షణగా, అందంగా కుట్టారని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్నదే కాకుండా మీరు నిరంతరం సాధన చేయడం ద్వారా అనేక మార్గాలలో సంపాదించవచ్చని అన్నారు. మేము కూడా మీరు అభివృద్ధి కావడానికి కావలసిన సహాయ సహకారాలు చేస్తాను అని చెప్పారు. ఉద్యోగాలకు ప్రిపరేషన్ అవుతున్న అభ్యర్థులు సమయం వృధా చేయకుండా ఇష్టంగా చదవడం ద్వారా మనం అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఏ చిన్న అవకాశం దొరికిన దానిని ఉపయోగించుకొని ఎంచుకున్న గమ్యానికి చేరుకోవాలని ఇచ్చారు. ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని కోరారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలబడినపుడే అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారన్నారు. స్వయంశక్తితో ఆర్థికంగా ఎదిగినపుడే మహిళలు అన్ని రంగాలలో ముందుకు వెళుతారని తెలిపారు. ప్రతి యువతి, మహిళ టైలరింగ్ తోపాటు బ్యూటీషియన్, చిన్నచిన్న వ్యాపారాల్లో నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికంగా తమ కుటుంబానికి సహాయపడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి రావాలని విద్యార్థి, నిరుద్యోగ యువతకు పిలుపునిచ్చారు. ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో అభివృద్ధి చెందాలని ఆకాంక్షతోనే మాడుగులపల్లి, ఇందుగుల గ్రామాలలో ఉచితంగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. సమాజంలో నేటికి మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలతోపాటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు, ఆత్మ రక్షణకు కరాటేలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సుగర్, బిపి, మూర్చ, పక్షవాతం రోగులకు ప్రతినెల మూడో అధివారం మందులు ఇస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఈ గ్రంథాలయాన్ని కంప్యూటర్స్‌తో కూడిన డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. వీటితో పాటు గ్రూపు2, బ్యాంక్ పిఓఎస్, డిఎస్సీ అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. పేద విద్యార్థులు, నిరుద్యోగ యువతి యువకులకు మరియు ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ ట్రస్టు పనిచేస్తుందన్నారు. వేసవి కాలంలో కంప్యూటర్, కరాటే, టైలరింగ్, చిత్రలేఖనం, డ్యాన్ నేర్పించనున్నట్లు చెప్పారు. మాసంస్థ ఇచ్చే అన్ని రకాల శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ సామాజిక సేవకులు ఎస్ కే వి ప్రసాద్, ఎంవిఎన్ కార్యనిర్వాహక కార్యదర్శి పి నర్సిరెడ్డి, టైలరింగ్ ఫ్యాకల్టీలు రేణుక, మంగ, వివిధ రంగాల బాధ్యులు వెండి శ్రీనివాస్, పీ శ్రీ కర్, డి అశోక్ రెడ్డి, పత్తాని శ్రీనివాస్, నాగమణి, భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయానికి మించి ఆస్తుల సంపాదన విషయంలో ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఒక న్యాయం ?? ఎమ్మెల్యే,ఎంపీలకు ఒక న్యాయమా ??

### భారీగా ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించే ఎమ్మెల్యే,ఎంపీల సభ్యత్వన్నీ రద్దు చేయాలని

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్



ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 19)ప్రతినిధి : ఆదాయానికి మించి ఆస్తులు సంపాదిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే పట్టుకుంటారా ?? అవినీతి శాఖ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు సంపాదిస్తూన్న ఎమ్మెల్యేలు, ఎంపీలను పట్టుకోరా అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా పోటీ చేస్తున్న సందర్భంలో ఉన్న ఆస్తులు వివరాలు, పదవి తర్వాత ఎన్ని ఆస్తులున్నాయో లెక్కించాలనీ లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఆస్తులకు మించి ఆస్తులు,డబ్బులు సంపాదిస్తే వారి మీద కూడా ఏసీబీ దాడులు చేయాలి రాజకీయ నాయకులకు ఒక న్యాయం ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఒక న్యాయమా ?? ఇది సరికాదని అన్నారు

## నల్గొండలో యూనిక్ మెన్స్ సెలూన్ ప్రారంభించిన డిప్యూటీ మేయర్, మాజీ మున్సిపల్ చైర్మన్



నల్గొండ ప్రభాత సూర్య: నల్గొండ నగరంలోని ప్రకాశం బజార్, మస్జిద్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన యూనిక్ మెన్స్ సెలూన్ షాపును మంగళవారం నల్గొండ మున్సిపల్ డిప్యూటీ మేయర్ అమీర్ అలీ ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ నల్లగొండ నగరంలో మెన్స్ సెలూన్ క్లాసిక్ స్టైలిష్ లుక్ ప్రారంభించడం యువతకు మంచి అవకాశం అని అన్నారు. స్టైలిష్ హెయిర్ కటింగ్స్, ఫేషియల్స్, చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హాజీ, నాదీమ్ ప్రొప్రైటర్ మొహమ్మద్ హర్షద్ అబ్దుల్ అహద్ ,ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటుకల బట్టిని సందర్శించిన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి



తుర్కపల్లి, మే 19 ప్రభాతసూర్య: తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలోని ఇటికల బట్టిని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మాధవి లత సందర్శించారు. ఈ సందర్భంగా బట్టిల కార్మికుల కుటుంబాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారి హక్కుల గురించి వివరించి సంక్షేమ పథకాలు పొందడానికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలని, తిరిగి ఒరిస్సాకు వెళ్లిన వారి పిల్లల భవిష్యత్తుకై అక్కడ చదువులను కొనసాగించాలని, తెలిపి ఏదైనా న్యాయ సహాయం కోసం న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించవచ్చని 15 100 కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇటిక బట్టీల కార్మికులు పాల్గొన్నారు

## అందోజు శ్రీనివాసుకు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ ప్రదానం



సంస్థాన్ నారాయణపురం, మే 19(ప్రభాత సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని జనగామ గ్రామానికి చెందిన అందోజు రాములు కుమారుడు అందోజు శ్రీనివాసు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) అనంతపురం నుండి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రొఫెసర్ సునీత యాదవ్ పర్యవేక్షణలో ఆయన ఆంగ్ల నవలలు–చలనచిత్రాలపై చేసిన సామాజిక పరిశోధనకు గాను ఈ డాక్టరేట్ లభించింది. మౌఖిక పరీక్షలో ప్రొఫెసర్ వై. ఎస్. శారద బాహ్య పరీక్షాధికారిగా వ్యవహరించగా, శ్రీనివాసు ప్రతిభను నిపుణులు అభినందించారు. సాహిత్యాన్ని, సినిమాను అనుసంధానిస్తూ స్థానిక చరిత్రలు, సాంస్కృతిక విలువలతో కూడిన చిత్రాలు రావాలని శ్రీనివాసు ఈ పరిశోధన ద్వారా స్పష్టం చేశారు. పీహెచ్‌డీ సాధించిన ఆయనను సీబీఐటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.వి. నరసింహులు ప్రత్యేకంగా అభినందించారు.

# తల్లి కూతుళ్లను హత్య చేసిన నిందితుల అరెస్టు

## భూమి కోసమే డిఎస్పీ రాజశేఖర్ రాజు




**మిర్యాలగూడ మే 29:- (ప్రభాత సూర్య) :**హాలియా పోలీస్ స్టేషన్ పరిధి ఇబ్రహీంపేట్ గ్రామానికి చెందిన రుద్రాక్షి సుమలత (45) ఆమె కుమార్తె రుద్రాక్షి లావణ్య (23) హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డిఎస్పీ కె. రాజశేఖర్ రాజు తెలిపారు. మంగళవారం రాత్రి పోలీసు సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసుల విచారణలో కుటుంబ భూవివాదాలు, ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన విభేదాల కారణంగా నిందితులు పూర్వ ప్రణాళిక ప్రకారం హత్యకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. మృతురాలు లావణ్య పేరుమీద ఉన్న సుమారు 5.24 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో నిందితులు దారుణానికి పాల్పడినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితులు మృతుల హత్యకు పన్నిన కుట్ర ప్రకారం ఈ నెల 17 ఉదయం మృతులు రుద్రాక్షి సుమలత, ఆమె కుమార్తె రుద్రాక్షి లావణ్యలు ఇబ్రాహీంపేట గ్రామ శివారులోని పామాయిల్ తోట వద్దకు పని నిమిత్తం వెళ్ళగా నిందితులు వారిని వెంబడించి హఠాత్తుగా దాడి చేసి కారం పొడి చల్లి, చున్నీలతో గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తెలినది. ఘటన అనంతరం పరారైన నిందితులను హాలియా పోలీసులు సాంకేతిక ఆధారాలు, సెల్‌ఫోన్ వివరాలు, గోప్య సమాచారంతో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నేరస్తుల నుండి ఎరుపు రంగు ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్ నేరానికి ఉపయోగించిన 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నమ్మన్నారు. గుర్రం నవనీత, నీలాయిగూడెం గ్రామం, త్రిపురారం మండలం, నల్లగొండ అంగడి రేణుక పంతంగి గ్రామం,గుండ్లపల్లి స్వామి రెడ్డిబావిగూడెం గ్రామం, చౌటుప్పల్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా.గుర్రం రమేశ్ నీలాయిగూడెం గ్రామం, త్రిపురారం, రుద్రాక్షి మహేశ్,పరారీలో ఉన్న నిమ్మల శశికళ ఇబ్రహీంపేట్ గ్రామం, అనుముల మండలం ఇబ్రహీం పేట్ గ్రామం అనుముల మండలం నిమ్మల వెంకన్న, రుద్రాక్షి నరసింహ వివరాలు తెలియవలసి ఉందన్నారు.నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ప్రస్తుతం హాలియా సర్కిల్ ఇంచార్జ్ బి. శ్రీనునాయక్ పర్యవేక్షణలో, త్రిపురారం ఎస్ఐ, కె.నరేశ్, హాలియా యస్ఐ, బి.సాయి ప్రశాంత్ ఆధ్వర్యంలో, వారి సిబ్బంది కె.కృష్ణ, కోటి, శివ, ముని రైటర్స్, కె.వెంకటేశ్వర్లు, కె.రమేశ్, క్లూస్ టీం సభ్యుల సమిష్టి సహకారంతో నిందితులను పట్టుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకుని భూ తగదాలు పరిష్కరించుకోవాలని హత్యలతో పరిష్కారం కాదని ఆయన అన్నారు.

## తెగిపోయిన కుంటను పరిశీలించిన అధికారులు



**తుర్కపల్లి, మే 19 ప్రభాతసూర్య :** తుర్కపల్లి మండలం చిన్న లక్ష్మాపురం గ్రామంలో ఇటీవల తెగిపోయిన నింగుల కుంట ను మంగళవారం డిఆర్డిఏ నాగిరెడ్డి, ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు.ఇటీవల గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి గ్రామంలో నింగుల కుంట చెరువు తెగిపోవడం జరిగిందని ఫారెస్ట్, డి ఎఫ్ ఓ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఫారెస్ట్ అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులు, ఉపాధి హామీ అధికారులు తెగిపోయిన కుంటను పరిశీలించి మరమ్మత్తులు చేయడానికి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఇట్టి పనులను ఉపాధి హామీ నిధుల ద్వారా మరమ్మత్తులు చేసే విధంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లంకల గీతారెడ్డి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జావేద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏపీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, పాల్గొన్నారు

## రవీంద్రభారతిలో ప్రతిభా పురస్కారం అందుకున్న సంస్థాన్ నారాయణపురం విద్యార్థిని గుండమల్ల అక్షిత.




**సంస్థాన్ నారాయణపురం, మే 19(ప్రభాత సూర్య ):** హైదరాబాద్ రవీంద్రభారతి లో ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు "ప్రతిభా పురస్కారం - 2026" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ప్రధానోపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా గౌరవ సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థాన్ నారాయణపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గుండమల్ల అక్షిత పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 569 మార్కులు సాధించి నారాయణపురం మండల టాపర్‌గా నిలిచింది. ఆమె ప్రతిభను గుర్తిస్తూ ఐ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రతిభా పురస్కారం అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం,మే 19(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మెంగవారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి దీవెనలు పొందారు. అనంతరం మెంగ వారి కుటుంబ సభ్యులు సర్పంచ్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ మెంగ లక్ష్మయ్య,మెంగ సత్తిపండు,మెంగ సైదులు,మెంగ గోపాల్, గంగనబోయిన యాదయ్య, మెంగ బాలకృష్ణ, కారోబార్ పున్నం యాదగిరి, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరగకుండా గుర్తించాలి

### తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భట్టు రాజేందర్ నాయక్



**ఖమ్మం( ప్రభాత సూర్య ప్రతినిధి ):** తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భట్టు రాజేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందిచారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక మంది తెలంగాణ ఉద్యమ కారులు 2001 నుండి 2014 వరకు రాష్ట్ర సాధన కోసం అవిశ్రాంత పోరాటం శాంతి యుతంగా చేసి రాష్ట్ర సాధనలో అగ్రభాగాన మా జిల్లా ఉద్యమ కారులు నిలబడ్డారు. అటువంటి వారిలో అనేకమంది మరుగునపడే ప్రమాదం ఉన్నందున అడ్వైజరీ కమిటీ వేసి నికార్సైన ఉద్యమ కారులు నష్టపోయే ప్రమాదం కూడా ఉంది.తమరు మా విన్నపాన్ని సానుభూతితో పరిశీలించి ఉద్యమంలో పాల్గొన్న అన్ని వర్గాలకు సముచిత న్యాయం చేకూరే విధంగా నిర్ణయం గైకొని ఉద్యమ కారులను ఆదుకోవాలని వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోరు గోపి ఎల్లమ్మ గౌడ్ పగడాల శ్రీను పసుపులేటి విజయ్ పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడుగా ఓర్సు శ్రీనివాస్





**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** నిరంతరం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు శ్రీనివాస్ అన్నారు.మంగళవారం జిహెచ్ఎంసి ఆదిబట్ల సర్కిల్, శంషాబాద్ జోన్,తుర్కయంజాల్ డివిజన్ 56 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఓర్సు శ్రీనివాస్ ని నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని,యువ నాయకుడు అభిషేక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేతలకు,ఎమ్మెల్యే కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి ప్రజాసేవకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తాను హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, సామ భీం రెడ్డి,మర్రి మహేందర్ రెడ్డి,కొంతం వెంకట్ రెడ్డి,వంగేటి గోపాల్ రెడ్డి,రేవలి యాదగిరి, నరసింహా రెడ్డి,రవీందర్ రెడ్డి, బద్రయ్య,ప్రశాంత్,నరేష్,సంజీవ, రాజేందర్,గిరి,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూర్ డివిజన్ అధ్యక్షుడుగా కోషిక ఐలయ్య





**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** నిరంతరం పార్టీ కోసం కష్టపడి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తొర్రూర్ డివిజన్ అధ్యక్షుడు కోషిక ఐలయ్య అన్నారు.మంగళవారం జిహెచ్ఎంసి ఆదిబట్ల సర్కిల్, శంషాబాద్ జోన్,తొర్రూర్ డివిజన్ 53 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కోషిక ఐలయ్య ని నియమించిన సందర్భంగా తొర్రూర్ ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు ఐలయ్య నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని,యువ నాయకుడు అభిషేక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేతలకు,ఎమ్మెల్యే కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి ప్రజాసేవకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తాను హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, సామ భీం రెడ్డి,మర్రి మహేందర్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి,వంగేటి గోపాల్ రెడ్డి,రేవలి యాదగిరి,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


## రైతుల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయం

తుర్కయంజాల్ సహకార సంఘం అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య

**తుర్కయంజాల్,ప్రభాత సూర్య:** రైతుల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయం అని తుర్కయంజాల్ సహకార సంఘం అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య అన్నారు.మంగళ వారం రోజున సంఘ పిఐసి కమిటీ సమావేశము సంఘ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అధ్యక్షతన సంఘ ప్రదాన కార్యాలయములో నిర్వహించారు.ఈ సమావేశములో నూతన సభ్యులుగా 11మందిని చేర్చుకోనైనది,13 మంది రైతులకు 1.65 ఒక కోటి అరవై ఐదు లక్షల రూపాయలు అప్పులు మంజూరు చేయనైనది, సంఘ 2025-26 ఆర్థిక సంవత్సరం యొక్క ఆడిట్ కాని ముగింపు లెక్కలు ను ఆమోదించనైనది,

**2026-2027ఆర్థిక సంవత్సరం**

1.4.2026 నుండి 30.4.2026 ఏప్రిల్ నెల జమ ఖర్చులు ఆమోదించనైది. మరియు సంఘ సభ్యుల సంక్షేమం కొరకు ఇతర అభివృద్ధి కార్యక్రమములు చేయుటకు ఆమోదించనైనది.ఈ సమావేశంలో సంఘుశీ మెంబర్లు కొత్త రాం రెడ్డి,చెక్క లక్ష్మమ్మ,



సామ సంజీవరెడ్డి,కుతడి నర్సింగ్ రావు,వంగేటి లక్ష్మా రెడ్డి,కోంద్రు స్వప్న,చాపల యాదగిరి,శీలం లక్ష్మమ్మ,జక్క కృష్ణ రెడ్డి,సామ సత్యనారాయణ రెడ్డి,సంఘ సెక్రెటరీ వై.రాందాస్ పాల్గొన్నారు.

# గీతం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి 'ఫ్యూచర్ ఎక్స్5'

GITAM
DEEMED TO BE UNIVERSITY



**పటాన్చెరు, మే 19,ప్రభాత సూర్య :** పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి 'ఫ్యూచర్ ఎక్స్5' పేరిట ఒక చైతన్యవంతమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల శ్రేణికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. గీతంలోని శిక్షణ, మార్గదర్శకత్వం, వృత్తి మార్గదర్శకత్వ డైరెక్టరేట్ (టీఎంసీజీ)లోని శిక్షణ, సామర్థ్య వికాస (టీసీడీ) విభాగం దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు డైరెక్టర్ డాక్టర్ రోజీనా మాథ్యూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, ప్రాజెక్టు మేనేజ్ మెంట్, క్వాంటం కంప్యూటింగ్, కార్పొరేట్ రెడీనెస్, ఎథికల్ హ్యాకింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల నుంచి అనుభవజ్ఞులైన నిపుణులను తీసుకురావడం ద్వారా విద్య, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ లక్ష్యంగా డాక్టర్ రోజీనా వివరించారు.మే 23 నుంచి జూన్ 6 వరకు నిర్వహించనున్న ఈ సెషన్లు, ప్రతివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆచరణాత్మక అవగాహన పొందడం, ప్రముఖ సంస్థల నిపుణులతో సంభాషించడం, ప్రస్తుత మార్కెట్ పోకడలను అర్థం చేసుకోవడం, వారి వృత్తిపరమైన, కెరీర్ సంసిద్ధతను మెరుగుపరచుకోవడం వంటివి చేస్తారని డాక్టర్ రోజీనా తెలిపారు.మే 23న వినియోగదారు సంబంధాల నిర్వహణ (సీఆర్ఎం), ప్రాజెక్టు నిర్వహణలను విల్ కామ్ డెలివరీ మేనేజర్ శశిధర్ కొండూరి పరిచయం చేస్తారన్నారు. మే 30న క్వాంటం కంప్యూటింగ్, భద్రతను ఈవై డైరెక్టర్ మూర్తి పరవశివం వివరిస్తారని తెలిపారు. మే 31న కార్పొరేట్ సంస్కృతిని అర్థం చేసుకోవడం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు, ఉత్పాదకత, స్వీయ బ్రాండింగ్ లపై ఎంఎక్స్4 భాగస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ గురుసిద్ధయ్య శిక్షణ ఇస్తారన్నారు. జూన్ 6న నైతిక హ్యాకింగ్ ను లిబరల్ సెక్యూరిటీ వ్యవస్థాపకులు సుజయ్ గంకిడి పరిచయం చేస్తారని డైరెక్టర్ వివరించారు. పరిశ్రమ భవిష్యత్తు పోకడలను అన్వేషించడానికి, వృత్తిపరమైన సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న కెరీర్ రంగాలకు తమను తాము సిద్ధం చేసుకోవడానికి ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా సెషన్లలో చురుకుగా పాల్గొనాలని డాక్టర్ రోజీనా మాథ్యూ సూచించారు.

## కరీంనగర్ పిఎంజె దొంగతనం కేసు

### ధర్మపురిలో దొంగలు బసచేసిన లాడ్జి సీజ్

కరీంగనర్: కరీంనగర్‌లోని పీఎంజే నగల దుకాణం దొంగతనం కేసు ధర్మపురిలో మరో కీలక అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దొంగతనానికి పాల్పడ్డ నిందితులు ఈ నెల 1 నుండి 3న ఉదయం 6 గంటల వరకు ధర్మపురిలో బస చేసిన విజయలక్ష్మి లాడ్జ్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సీజ్ చేసారు. ఇంతకాలం ఈ లాడ్జ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తుంటే అధికారులకు కనిపించలేదా..? దొంగలు బస చేసిన తర్వాతే అక్రమాలు గుర్తొచ్చాయా..? ధర్మపురి వంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రతీ రోజు వందలాది మంది భక్తులు, యాత్రికులు బస చేస్తుంటారు. అలాంటి ప్రాంతంలో వసతి గృహాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా..? అతిథుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారా..? సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా..? పోలీస్ వెరిఫికేషన్ జరుగుతోందా..? వంటి అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ ఉండాలని అంటున్నారు. కానీ ఘటన జరిగిన తర్వాత మాత్రమే అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదలికలోకి రావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒక లాడ్జ్‌ను సీజ్ చేయడం ద్వారా సమస్య పరిష్కారం కాదని పలువురు పేర్కొంటున్నారు. ధర్మపురిలో అనుమతులు లేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా నడుస్తున్న ఇతర వసతి గృహాల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దొంగలు రెండు రోజుల పాటు బస చేసినా ఎవరూ అనుమానం వ్యక్తం చేయకపోవడం, వారి కదలికలపై సరైన నిఘా లేకపోవడం భద్రతా వ్యవస్థల వైఫల్యానికే సంకేతంగా కనిపిస్తోంది. ఒక సంఘటన తర్వాత తాత్కాలిక హడావిడి చేయడం కంటే, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యవస్థను బలోపేతం చేయడమే ముఖ్యమని ప్రజలు సూచిస్తున్నారు. ధర్మపురి ప్రతిష్ఠ, భక్తుల భద్రత దృష్ట్యా ఇప్పుడు అవసరమైంది ఒక్క లాడ్జ్‌పై చర్య కాదని కఠినమైన సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

## చురుకుగా జనగణన సర్వే

కరీంగనర్: కరీంగనర్ జిల్లాలో చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో జనగణన సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని 17 గ్రామాలకు గాను 70 మంది ఎన్యూమరేటర్స్, 11 మంది సూపర్వైజర్లు జనగణన సర్వేలో పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబానికి 34 ప్రశ్నలతో కూడిన సమాధానాలను నమోదు చేసుకుంటున్నారు. ఇంటి పేరు, కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, మౌలిక వసతులు మొదలగు అంశాలను సర్వేలో నమోదు చేసుకుంటున్నారు. జూన్ 9 వరకు జనగణన సర్వే పూర్తి చేయాలని అడిషనల్ చార్జి ఆఫీసర్ ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు. కాగా మంగళవారం మండలంలోని చిగురుమామిడి, రేకొండ తదితర గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించారు. మండలంలోని ప్రజలు జనగణన సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని వారు మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనకపోవడంతో రైతులకు తిప్పలు

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత

కరీంగనర్: రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతూ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీయడంతో పాటు ధాన్యానికి ప్రభుత్వ మద్ధతు ధర చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం వహిస్తున్న అలసత్వం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రైతులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పుచ్చలపల్లి జీవితం నేటి తరానికి ఆదర్శం

### వర్ధంతి సభలో సిఐటియు నేత నివాళి

ఖమ్మం,మే19:పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి కార్మిక వర్గానికి ఆదర్శం కావాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్ రావు అన్నారు. పేదల పెన్నిధి, భారత దేశంలో అన్ని వర్గాల ప్రజలకు ఆశా జ్యోతి, తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. మంగళవారం సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. జిల్లా ఆల్ ఆటో మోబైల్ షోరూమ్స్ కమిటీ ఆధ్వర్యంలో షోరూం దగ్గర నిర్వహించిన సభలో జిల్లా అధ్యక్షుడు బిమగాని నాగ శ్రీనివాసరావు, కోశాధికారి గర్రెపల్లి ప్రవీణ్, ఉపాధ్యక్షులు బూసిపోగు వెంకటేశ్వరరావు, ప్రకాష్, గోవర్ధన్, నరేష్, వసంత బాబు, శ్రీకాంత్, రాంబాబు, రవి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పుచ్చలపల్లి రాజీలేని పోరాటం

### వర్ధంతి సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా సమస్యల పరిష్కారంలో ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య వీరోచిత పోరాటం చేశారని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభ సారపాకలోని సుందరయ్యనగర్‌లో పాపినేని సరోజిని అధ్యక్షతన జరిగింది. తొలుత బూర్గంపహాడ్ మండల కార్యదర్శి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం ఆ రోజుల్లో పుచ్చలపల్లి పోరాట త్యాగం చేశారని, పేద ప్రజల పక్షాన పోరాడి కూలీ రేట్లు పెంచారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సుందరయ్య పోరాట పటిమ ఎనలేనిదని, ఆయన త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై బారాలు మోపుతుందని, అదేవిధంగా రాష్ట్రంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే జూన్ 2న పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, దీనికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## శారీరక సాక్షరత ప్రాముఖ్యం పెరగాలి

### పుల్లెల గోపీచంద్



హైదరాబాద్: గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత పుల్లెల గోపీచంద్ 'ఫిజికల్ లిటరసీ' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత సాధికారత, ఫిట్‌నెస్ ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా ఈ వేడుకలు కొనసాగుతు న్నాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, శారీరక సాక్షరత ప్రాధాన్య త కేవలం క్రీడాకారులకు మాత్ర మే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ తెలియాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం, క్రీడాస్ఫూర్తి పెంపొందించడం లో ఫిజికల్ లిటరసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. క్రీడారంగం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ముఖ్యమైన రంగాల్లో ముందుంటుందని, ఆరోగ్యవంతమైన సమాజం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డా. ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026' ద్వారా శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, క్రీడల్లో సామాజిక భాగస్వామ్యాన్ని విస్తరించడం, రాష్ట్రంలోని ప్రతిభావం తులైన క్రీడాకారులను గుర్తించడం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవితేజ, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, కోచ్‌లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదుతో సంస్థాగత నిర్మాణం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి,మే19:**బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుతో సంస్థాగత నిర్మాణం పటిష్టం చేపట్టాలి నాయకులు, కార్యకర్తలు పార్టీకి అంకితమై సభ్యత్వ నమోదు చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మన వనపర్తిలో 70వేల 500 సభ్యత్వం జరిగింది. సాకులు చెప్పి సభ్యత్వ నమోదులో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పార్టీ పట్ల విధేయత, చిత్తశుద్ధి, అంకితభావం ఉన్న కార్యకర్తలకు పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల స్పందించే నాయకులు నిత్యం ప్రజలలో ఉండే నాయకులే పార్టీ పదవులు వస్తాయని పేర్కొన్నారు. దుష్ప్రచారం వల్ల గత ఎన్నికలో ఓడిపోయాం. కార్యకర్తల శిక్షణనే పార్టీకి శ్రీరామరక్ష. ÷లంగాణ సోయి లేనివాళ్లు నీటి పాలకులుగా ఉండడం దురదృష్టకరమన్నారు. హామీలు విస్మరించిన నాయకులను గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

### ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

### ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ

### మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి

హైదరాబాద్,మే19(ఆర్ఎన్ఎ): నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ, చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ



అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు.మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన

అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో

# ఆర్థిక కార్యాచరణ అత్యవసరం!

**నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు.**

హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్మూజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యవాసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అనన్నింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

**ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి.**

ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు. ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతి నిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటు న్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా



డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళుతుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పులుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

# దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

**మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷-తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు.**

దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20-30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం

వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత.

ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తమ పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం



రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్దం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షోభాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.



# ‘టాక్సిక్’లో బోల్డ్ సీన్స్ వివాదం ...

## కియారా అద్వానీ క్లారిటీతో పుకార్లకు చెక్

కన్నడ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా ‘టాక్సిక్’ చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రకు సంబంధించిన బోల్డ్ సన్నివేశాలపై వచ్చిన వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి. సినిమాలో తనపై చిత్రీకరించిన కొన్ని హాట్ సీన్స్‌ను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. టీజర్‌లో కనిపించిన గ్లామరస్ విజువల్స్ కారణంగా ఈ వార్తలకు మరింత ఊపు వచ్చింది. దీంతో సినిమాలో ఘాటైన సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలు ప్రేక్షకుల్లో పెరిగాయి.అయితే ఈ మొత్తం ప్రచారంపై కియారా అద్వానీ స్వయంగా స్పందిస్తూ స్పష్టమైన క్లారిటీ ఇచ్చింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన ఆమె.. “నేను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా నిరాధారమైన పుకార్లే” అని పేర్కొంది. దీంతో ఈ వివాదానికి పూర్తిగా తెరపడినట్లైంది. ఈ చిత్రం టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్ర చుట్టూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు, సినిమా కథపై కూడా ఆసక్తిని పెంచింది. అయితే అధికారిక సమాచారం లేకుండానే పుట్టుకొచ్చిన ఊహాగానాలు ఒక్కసారిగా వైరల్ కావడం ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమైంది. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ సినిమా ప్రారంభం నుంచే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. యష్ -- కియారా కాంబినేషన్ కూడా సినిమాపై మరింత హైప్‌ను తీసుకొచ్చింది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ధృవీకరించని వార్తలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో ‘టాక్సిక్’ వివాదం మరోసారి నిరూపించింది. అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వార్తలను నమ్మడంలో జాగ్రత్త అవసరమని ఈ సంఘటన సూచిస్తోంది .

# బాలీవుడ్ భామ హ్యూమా ఖురేషి పెళ్లి

ఇటీవల సినీ పరిశ్రమలో పెళ్లిళ్ల సందడి కొనసాగుతున్న విషయం తెలిసిందే. వరుసగా పలువురు హీరోలు, హీరోయిన్లు వివాహ బంధంలోకి అడుగుపెడుతుండగా, ఇప్పుడు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కూడా ఈ జాబితాలో చేరబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రముఖ బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి త్వరలో పెళ్లి చేసుకోనుందని సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్ సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన హ్యూమా ఖురేషి, తొలి సినిమాతోనే తన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత వరుసగా పలు సినిమాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ముఖ్యంగా మహారాణి వెబ్ సిరీస్ ద్వారా ఆమెకు విపరీతమైన స్టార్‌డమ్ వచ్చింది. ఈ సిరీస్‌లో ఆమె పోషించిన పాత్రకు విమర్శకుల ప్రశంసలు లభించాయి. లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ, తన నటనతో ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తోంది. వ్యక్తిగత జీవిత విషయానికి వస్తే, హ్యూమా ఖురేషి గత కొంతకాలంగా బాలీవుడ్ నటుడు రచిత్ సింగ్ తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. వీరి ప్రేమ కథ బాలీవుడ్‌లో ఓపెన్ సీక్రెట్‌గా మారిందని చెప్పాలి. ఇద్దరూ కలిసి అనేక ఈవెంట్స్, పార్టీల్లో కనిపించడం, సోషల్ మీడియాలో కూడా ఒకరిపై ఒకరు అభిమానాన్ని వ్యక్తం చేయడం వలన వారి రిలేషన్‌షిప్‌పై స్పష్టత వచ్చింది. తాజా సమాచారం ప్రకారం, ఒక స్నేహితుడి పెళ్లి వేడుకలో ఈ ఇద్దరూ తొలిసారి కలుసుకున్నారని తెలుస్తోంది. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా మారి, తర్వాత ప్రేమగా మారింది. గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్న ఈ జంట ఇప్పుడు తమ బంధాన్ని వివాహంగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఏడాది అక్టోబర్‌లో హ్యూమా ఖురేషి -- రచిత్ సింగ్ వివాహం జరగనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ పెళ్లిని గ్రాండ్‌గా నిర్వహిస్తారా? లేక ఇతర సెలబ్రిటీల మాదిరిగానే డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేస్తున్నారా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇటీవల బాలీవుడ్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ ట్రెండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ జంట కూడా అదే బాటలో నడుస్తుందా అన్నదానిపై చర్చ జరుగుతోంది. మరోవైపు, ఈ పెళ్లి వార్తలపై హ్యూమా ఖురేషి లేదా రచిత్ సింగ్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఈ వార్తలు వైరల్ అవుతుండగా, అభిమానులు ఇప్పటికే ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నిజంగా ఈ వార్తలు నిజమైతే, త్వరలోనే బాలీవుడ్‌లో మరో గ్రాండ్ వెడ్డింగ్ చూసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.





# కల్కి-2 షూటింగ్‌లో ప్రభాస్ చేరిక

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి ’కల్కి 2898 -2’ ప్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ÷నైల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన ’కల్కి’లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.



# సొంత కథతో సిద్ధం అవుతున్న రామ్

దేవదాసుతో వెండితెరకు పరిచయమైన రామ్ తన ఎనర్జీతో, డ్యాన్స్‌తో, యాక్టింగ్‌తో టాలీవుడ్‌ను ఊపేశాడు. లవర్ బాయ్‌గా అమ్మాయిల మనసు గెలిచిన రామ్, ఇస్మార్ట్ శంకర్ తో మాస్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. కానీ, గడిచిన కొంతకాలంగా రామ్ కెరీర్ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పడింది. వరుస ప్లాపులు.. అంచనాలు తప్పిన లెక్కలు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు రామ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. రామ్ కెరీర్‌ను ఒకసారి గమనిస్తే.. అటు క్లాస్ సినిమాలతో పాటు, మాస్ సినిమాలతోనూ సత్తా చాటుకున్నారు. ఇక కరోనా కు ముందు వచ్చిన ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ మైల్‌స్టోన్‌గా నిలిచింది. పూరీ జగన్నాథ్ మార్క్ మేనరిజమ్స్‌తో రామ్ ఊరమాస్ అవతారంలో అదరగొట్టాడు. కానీ ఆ తర్వాత వచ్చిన రెడ్, ది వారియర్, స్కంద, చివరకు డబుల్ ఇస్మార్ట్ కూడా ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయాయి. రీసెంట్ మూవీ ఆంధ్రా కింగ్ కథ పరంగా బాగుందని ప్రశంసలు దక్కించుకున్నా, కమర్షియల్‌గా రామ్‌కు కావాల్సిన పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. దీంతో రామ్ తన కెరీర్ పట్ల పూర్తిస్థాయి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక హీరో వరుస ప్లాపుల్లో ఉంటే కొత్త దర్శకుల కోసం వెతుకుతారు. కానీ రామ్ ఆలోచన డిఫరెంట్‌గా ఉంది. తన బలాలు ఏంటి? బలహీనతలు ఏంటి? అనేది ఒక నటుడిగా తనకన్నా బాగా ఇంకెవరికి తెలుస్తుంది అనుకున్నాడట. అందుకే తన తదుపరి సినిమాకు తానే కథను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మొదట కథ ఇచ్చి వేరే దర్శకుడితో చేయిద్దాం అనుకున్నా, చివరి నిమిషంలో మనసు మార్చుకుని మెగాఫోన్ పట్టాలని డిసైడ్ అయ్యాడట. సినిమాల ఎంపికలోనూ, మేకింగ్ ప్రాసెస్‌లోనూ రామ్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. ఇప్పుడు అదే అనుభవంతో తన సొంత బ్యానర్ స్రవంతి మూవీస్ లో ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో అడవి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోస్ తమ సొంత కథలతో సక్సెస్ అవుతున్నారు.

# జైహనుమాన్‌లో అక్షయ్ ఖన్నా?



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. ప్రస్తుతం అందరి కళ్లు ఆయన ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న ’జై హనుమాన్’పైనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా నటనకు ఫిదా అయిన ప్రశాంత్ వర్మ, ఆయనను ’జై హనుమాన్’ ప్రాజెక్టులోకి కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని ’మహాకాళి’ చిత్రంలో అక్షయ్ ఖన్నా ’శుక్రాచార్యుడి’ గా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అక్షయ్ ఖన్నా పోషించబోయే పాత్రపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ’మహాకాళి’లో ఆయన చేస్తున్న శుక్రాచార్యుడి పాత్రకు, ’జై హనుమాన్’లోని పాత్రకు ఏమైనా లింక్ ఉంటుందా? లేక ఇది సరికొత్త పాత్రనా? అన్నది మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ తన యూనివర్స్‌లోని పాత్రలను ఒకదానితో ఒకటి అనుసంధానించడంలో దిట్ట కాబట్టి, అక్షయ్ ఖన్నా ఎంట్రీ ఈ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తోంది. కేవలం బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొనే కాకుండా, పాత్రకు ఉన్న వెయిటేజ్ కారణంగానే ఆయనను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. క ’జై హనుమాన్’లో కన్నడ స్టార్, ’కాంతార’ ఫేమ్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ హనుమంతుడుగా చేస్తున్న విషయం తెలిసిందే. రిషబ్ శెట్టి లాంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు తోడు అక్షయ్ ఖన్నా వంటి వెర్సటైల్ యాక్టర్ తోడవ్వడం సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది, కాబట్టి అక్షయ్ ఖన్నా రోల్ కూడా కథను మలుపు తిప్పేలా ఉంటుందని టాక్. మొత్తానికి ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను పాన్-ఇండియా లెవల్‌లో స్టాం÷-రగ్‌గా బిల్డ్ చేస్తున్న తీరు చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమనిపిస్తోంది. ’జై హనుమాన్’లో అక్షయ్ ఖన్నా రోల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.